హోరాహోరీగా రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

పురుషుల జట్ల మధ్య రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను జిల్లా కేంద్రంలోని ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 320 మంది మహిళా, 336 మంది పురుష క్రీడాకారులు పాల్గొన్నారు. 82 మంది వివిధ జిల్లాల జట్ల మేనేజర్లు, కోచ్‌లు, 25 మంది టెక్నికల్ సిబ్బంది, 80 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌వో నాగరాజు తెలిపారు. పోటీలు ప్రారంభానికి ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోటీల్లో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్, ఎస్ఏటీజీ పరిశీలకుడు భరత్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, పీడీలు మధు, దేవేందర్ రెడ్డి, అశోక్, వినోద్, ప్రతాప్‌సింగ్, రాజేందర్, మాలతి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొల్చారం, డిసెంబర్ 28: మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో ఉన్న మంజీరా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంశెట్టిపల్లి టీ జంక్షన్ నుంచి ఏడుపాయలకు వెళ్లే దారిలో మొదటి బ్రిడ్జి వద్ద సుమారు 44 ఏండ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం నది నీళ్లలో తేలియాడుతున్నది. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై తారాసింగ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తీసి, పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడు ఎరుపు రంగు ఆఫ్ బనియన్, నీలంరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. పోతంశెట్టిపల్లి పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 28: చిన్నశంకరంపేట శివారు పారిశ్రామికవాడల్లో గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి తెలిపారు. రాధాస్టీల్ పరిశ్రమ వద్ద గంజాయిని విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంతో ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు పారిశ్రామిక వాడల్లో దాడులు నిర్వహించామన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజేశ్, రుషిదేవ్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతన వద్ద సోదా చేయగా 190 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. వెంటనే ఆ వ్యక్తిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిషేదిత మత్తుపదార్థాలను విక్రయిస్తు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రాణి హెచ్చరించారు. ఈ దాడుల్లో రామాయంపేట ఎక్సైజ్ ఎస్సై విజయ సిద్దార్థ, హెడ్ కానిస్టేబుల్ దుర్గారెడ్డి, కానిస్టేబుల్ వెంకటేశం, స్వామి, దినేశ్, శ్రీకాంత్, రాకేశ్ ఉన్నారు.

కారు అదుపు తప్పి ఒకరు మృతి

మెదక్‌రూరల్, డిసెంబర్ 28: కారు టైరు పంక్చరై అదుపు తప్పి పల్టీకొట్టి, ఒకరు మృతి చెందిన ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ లోని మంబోజిపల్లి శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్‌లోని భరత్‌నగర్ కాలనీకి చెందిన బాల్‌రాజ్, భార్య విశ్రాంతమ్మ (64) కుటుంబసభ్యులతో కలిసి మెదక్ చర్చికి వెళ్తున్నారు. మంబోజిపల్లి శివారులో రాగానే కారు టైరు పంక్చరై అదుపు తప్పి పల్టీకొట్టింది. దీంతో రోడ్డు కింద పడిపోవడంతో విశ్రాంతమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. బాల్‌రాజ్, కుమారుడు బాబురావుకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం మెదక్‌లోని ప్రభు త్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటన పై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని మెదక్ రూరల్ ఏఎస్ఐ వెంకటయ్య తెలిపారు.

రెవెన్యూ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

చిన్నశంకరంపేట, డిసెంబర్ 28: రెవెన్యూ రికార్డుల నిర్వహణపై చిన్నశంకరంపేట మోడల్ పాఠశాల ఒకేషనల్ విద్యార్థులకు తహసీల్ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై తహసీల్దార్ మన్నన్ శనివారం అవగాహన కల్పించారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

నర్సాపూర్,డిసెంబర్28: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, కమిషనర్ రామకృష్ణారావు, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్లు, మేనేజర్ మధుసూధన్ శనివారం నివాళులర్పించారు.

వ్యవసాయ రంగంపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు సాంకేతిక పరమైన శిక్షణనిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

రామాయంపేట, డిసెంబర్ 28: విద్యార్థులకు సాంకేతిక పరమైన శిక్షణను ఇస్తున్నామని రామాయంపేట వ్యవసాయ శాఖ అధికారి రాజ్ నారాయణ అన్నారు. వ్యవసాయ పనిముట్లు, పనులపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. పంటలకు వేసే మందులు, ఎలా పిచికారీ చేయాలి, దిగుబడి ఎలా వస్తుందనే దానిపై అవగాహన కల్పించారు. రైతులు డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు. వాటితో లాభనష్టాలపై వివరించారు. విద్యార్థులు సాగుపై దృష్టి పెడితే వ్యవసాయానికి మించిన పని ఇంకోటి లేదన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిజాంపేట, డిసెంబర్ 28: చల్మెడ గ్రామానికి చెందిన శ్రీశైలం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ శనివారం బాధిత కుటుంబసభ్యులను మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అభివృద్ధే లక్ష్యంగా పటిష్ట ప్రణాళికలు

- రూ.5 కోట్లతో 94 పనులు
- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట: మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ

మెదక్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పటిష్ట ప్రణాళిక చేస్తున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మెదక్ నియోజకవర్గ అభివృద్ధిపై అదనపు కలెక్టర్ నగేశ్, ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, ఈఈ పీఆర్ నర్సింలు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్సీ నియోజకవర్గ అభివృద్ధి నిధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. 2021- 22, 22- 23కు గాను రూ.5.60 కోట్ల వ్యయంతో 94 పనులు చేపట్టామన్నారు. ఇందులో సీసీ రోడ్లు, భవన నిర్మాణాలు ఉన్నట్లుగా చెప్పారు. ఇప్పటివరకు 55 పనులు కంప్లీట్ చేశామని, 24 పనులు వివిధ దశలో పురోగతిలో ఉన్నాయన్నారు. పెండింగ్ పనుల్లో వేగం పెంచాలని, వివిధ దశల్లో పురోగతిలో ఉన్న పనులను జనవరి ఆఖరు వరకు పూర్తి చేసేలా పనిచేయాలన్నారు. గ్రీన్ ఫండ్ కింద రూ.62 లక్షల నిధులు మంజూరయ్యాయని, మెదక్‌లోగాని, కొల్చారం మండలంలో నవగ్రహ వనం నక్షత్రవనం కార్యక్రమం అమలుచేయాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

చిన్నశంకరంపేట,డిసెంబర్28: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి తెలిపారు. చిన్నశంకరంపేటలోని అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద అయ్యప్ప మహాపడిపూజకు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీని స్వాములు ఘనంగా సన్మానించారు. స్వాములు గంగానరేందర్ మైనంపల్లి రంగారావు, రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి , సాన సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రావు, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ఆర్థిక సాయం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

నర్సాపూర్: మహాసభలకు వెళ్తున్న నాయకులు

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ/ పాపన్నపేట, డిసెంబర్ 28: హక్కుల కోసం కలెక్టరేట్ ఎదుట సమ్మె చేసున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు పాపన్నపేట మండల పీఆర్టీయూ శాఖ సంఘీభావం తెలిపింది. శనివారం మౌలిక అవసరాల నిమిత్తం రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రాజు, సురేశ్, కృష్ణమూర్తి, దేవయ్య, రాఘవేందర్, సిద్దేశ్వర్ సంపత్, శ్యామల, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

వెల్దుర్తి, డిసెంబర్ 28: డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎస్‌టీజీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, ఉద్యోగాను రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్, ప్రభుత్వం వచ్చాక మర్చిపోయారన్నారు.సమ్మెతో కేజీబీవీ విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయన్నారు.

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

నర్సాపూర్, డిసెంబర్ 28: 18 రోజులుగా యూఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చొరువ చూపాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పద్మారావు, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నల్లగొండలో జరుగుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలకు నర్సాపూర్ నుంచి శనివారం బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కవిత, కేజీబీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు సహాసిని, జిల్లా కార్యదర్శులు ఏసయ్య, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

చాకరిమెట్లలో అదనపు కలెక్టర్ మృత్యుంజయ హోమం

మృత్యుంజయహోమం చేస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్ దంపతులు

శివ్వంపేట, డిసెంబర్ 28: చిన్నగొట్టిముక్ల పంచాయతీలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా అదనపు కలెక్టర్ మెంచు నగేశ్ కుటుంబ సమేతంగా శనివారం మృత్యుంజయ హోమం చేశారు ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పూజారులు దేవదత్తశర్మ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



పెద్దశంకరంపేటలో చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, డిసెంబర్ 28: ఆపదలో ఆసరాగా సీఎంఆర్ఎఫ్ చెక్కు ఉపయోగపడుతుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపని వెంకటాపురం గ్రామానికి చెందిన జి.సాయిలు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.60 వేల చెక్కును నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం అందజేశారు. సీఎం సహాయనిధి పేద వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయనతో నాయకులు కోనం అంజయ్య, మాణిక్ రెడ్డి తదితరులున్నారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి

డీఈవోకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 28: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఈ వో రాధాకిషన్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో సురేఖ కంటి దవాఖాన హైదరాబాద్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీఈవో ప్రారంభించారు. సుమారు 100మందికి కంటి పరీక్షలు చేశారు. పది మందికి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. డాక్టర్ సాయికిరణ్, సిబ్బంది, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య, నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి

కొల్చారం: ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

పెద్దశంకరంపేట: అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

కొల్చారం, డిసెంబర్ 28: కొల్చారంలో నిర్వహిస్తున్న ఇండ్ల సర్వేను జడ్పీ సీఈవో ఎల్లయ్య శనివారం తనిఖీ చేశారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన పేదలకు లబ్ధి చేకూరేలా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ అంజయ్య ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, డిసెంబర్ 28: ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌పీవో సురేష్‌బాబు అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో మాట్లాడి, ఇందిరమ్మ యాప్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీకున్నీసా, ఈవో వెంకట్రాములు, రామారెడ్డి, సత్యంబాబు, ఎర్ర యాదిరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం డెలివరీలో వేగం పెంచాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

- అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సీఎంఆర్ బియ్యం డెలివరీలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ నగేశ్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ బియ్యం డెలివరీ పురోగతిపై జిల్లాలోని రైస్ మిల్లర్స్‌తో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మిల్లర్లు వానకాలం బియ్యం డెలివరీని ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు వంద శాతం పూర్తి చేసినందుకు హర్షం వ్యక్తంచేశారు. యాసంగి 2023-24 సీజన్‌లో ప్రభుత్వం 2,52,013 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలోని 67 రైస్ మిల్లులకు కేటాయించిందన్నారు. ఇందుకు 1,70,856 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందన్నారు. ఇందులో ఈ రోజు నాటికి 99,339 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిల్లర్లు అందజేశారని, ఇప్పటికే 58 శాతం టార్గెట్ పూర్తి చేశారన్నారు. మిగిలిన 42 శాతం టార్గెట్ 71,517 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గడువు లోపు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరి కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రపాల్ పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ఎనిమిది మంది కూలీలకు తీవ్రగాయాలు

అదుపుతప్పి బోల్తాపడిన ట్రాక్టర్

వెల్దుర్తి, డిసెంబర్ 28: స్లాబ్ వేయడానికి మిల్లర్, సామగ్రి, కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఎనిమిది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మాసాయిపేట మండలంలోని అచ్చంపేట శివారు జమున ఫీడ్ మిల్లు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన తుమ్మల వెంకటేశం తనకున్న స్లాబ్ మిల్లర్, సామగ్రి, 13 మంది కూలీలతో చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో స్లాబ్ వేయడానికి వెళ్తున్నాడు. అచ్చంపేట శివారు జమున హ్యాచరీస్ ఫీడ్ మిల్లు సమీపంలో ట్రాక్టర్ బంపర్ విరిగి ముందున్న ఎడమ టైర్ కింద పడడంతో అదుపుతప్పింది. ట్రాక్టర్ ఎడమ వైపు రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్‌లోని కూలీలు ఒక్కసారిగా ఎగిరిపడడం, వారిపై స్లాబ్ వేయడానికి ఉపయోగించే సామగ్రి పడడంతో రవి, మల్లేశ్, మంజుల, సాయికుమార్, మధు, యాదమ్మ, నరేశ్, సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న యజమాని అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. మరో ట్రాక్టర్‌ను తెచ్చి గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో, ట్రాక్టర్‌లో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న వెల్దుర్తి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చేగుంటలో పంచాయతీ కార్మికుల వంటా వార్పు

చేగుంట ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల వంటావార్పు

చేగుంట, డిసెంబర్ 28: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని కోరుతూ శనివారం చేగుంట ఎంపీడీవో కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కార్మికులు ఐదు నెలలుగా జీతాలు లేకుండా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లం, బాలేశ్,రాజు పాల్గొన్నారు.

ఊరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

మెదక్‌రూరల్, డిసెంబర్ 28: తన చావుకు తన తల్లిదండ్రులే కారణమంటూ లేఖలో రాసి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జానకంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దివిటి మల్లయ్య కుమార్తె శ్రావణి (17) మెదక్ కేజీబీవీలో పదో తరగతి చదువుతున్నది. ఈ నెల 22న బోనాలకు ఇంటికి వచ్చిన శ్రావణి శనివారం ఇంట్లో ఫ్యానుకు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఘటన స్థలంలో లేఖలో దొరికింది. మల్లయ్య మొదటి భార్య ఇందిర పదేండ్ల క్రితం మృతి చెందింది. జ్యోతిని రెండో వివాహం చేసుకున్నాడు. ముగ్గురు కుతూర్లు, ఇద్దరు కుతూర్ల పెళ్లిళ్లు చేశాడు. చిన్నకూతురు శ్రావణి. తన చెల్లి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి అక్కలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

3న మహిళా టీచర్లకు సన్మానం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 28: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని 94 మంది మహిళా టీచర్లను సన్మానించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సంఘం తెలిపింది. జనవరి 3న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యదర్శి చింతల నర్సింలు, జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాం, మల్లేశం తెలిపారు. శనివారం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

నాగరాజు (ఫైల్)

చిన్నశంకరంపేట, డిసెంబర్ 28: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సూరారంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన పిట్ల నాగరాజు(34) ఈనెల 25న ఆర్థిక ఇబ్బందులతో కుమ్మరి కుంట వద్ద పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని నాగరాజు ఫోన్ ద్వా రా తన భార్య నవనీతకు తెలుపాడు. వెంట నే కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య నవనీత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు కృషి చేయాలి

రామాయంపేట, డిసెంబర్ 28: ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ తెలిపారు. శనివారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కనబడకుండా పటిష్టమైన చర్యలు చేపడ్తున్నామన్నారు. సమావేశంలో గురుస్వాములు శంకరయ్య, శ్రీధర్ గుప్తా, నర్సింహులు, నగేశ్, సాగర్, స్వామి, సాయి, రాజు ఉన్నారు.

పరిస్థితి విషమించి జర్నలిస్టు మృతి

నర్సాగౌడ్ (ఫైల్)

రామాయంపేట/నిజాంపేట డిసెంబర్ 28: చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి ఉమ్మడి మండలం నస్కల్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పాతూరి నర్సాగౌడ్(48) శనివారం మృతి చెందాడు. జర్నలిస్టు వృత్తిలో ఉండి వివిధ పత్రికల్లో విలేకరిగా పనిచేశాడు. నెలరోజుల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేవాడు. వివిధ కార్పొరేట్ దవాఖానల్లో చికిత్సలు పొందుతున్నాడు. శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని టీయూడబ్ల్యుజే, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌దయాల్ చారి, కంది శ్రీనివాస్‌రెడ్డి, డీజీ శ్రీనివాస్ శర్మ, శ్రీధర్ తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి డాక్టర్ మోహన్‌నాయక్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

నిజాంపేట, డిసెంబర్ 28: కల్వకుంటకు చెందిన పారిశుధ్య కార్మికుడు రామయ్య (62) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి శనివారం మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు, అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డి రూ.3 వేలు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.



రామాయంపేట, డిసెంబర్ 28: రామాయంపేటకు చెందిన ఎంవి.సుగుణమ్మ (85) దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338986-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసింద